క్లుప్తంగా

పాఠశాలకు బీరువా వితరణ



పాఠశాలకు బీరువా అందజేస్తున్న ఉపాధ్యాయుడు

కొండపి: మండలంలోని పెద్ద కండ్లకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆంగ్ల ఉపాధ్యాయుడు తంగెళ్ల చంద్రశేఖర రావు బీరువా అందజేశారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ తన తండ్రి తంగెల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఈ బీరువాను జ్ఞాపకార్థంగా పాఠశాలకు బహూకరించానని తెలిపారు. ఉపాధ్యాయుడిని పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు అభినందించారు.

మెట్టపైర్లకు జీవం పోసిన వర్షం



కొమ్మ వేస్తున్న కంది పంట

పీసీపల్లి: మండలంలోని ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి మెట్ట పంటలకు జీవం పోసినట్లు అయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం, నువ్వులతో పాటు కంది పంటకు కూడా ఈ వర్షం మంచి చేకూరుస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

20 నుంచి సీపీఐ మహాసభలు



సయ్యద్ యాసీన్

కనిగిరిరూరల్: సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం.. 'కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పై సాగే పోరులో భాగస్వాములు అవుదాం' అనే నినాదంతో ప్రతి ఒక్కరు ప్రజా పోరాటలకు సిద్ధం కావాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ పిలుపు నిచ్చారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సీపీఐ తొలిసారిగా రాష్ట్ర మహాసభలను ఒంగోలు నగరంలో జరుపుతున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈనెల 23న ఒంగోలులో వేలాది మందితో ప్రజా ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. సోమవారం 18న కనిగిరిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక దరిశి చెంచయ్య భవన్ వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై పట్టణ ప్రధాన రహదారుల్లో, కూడళ్లలో సాగుతుందన్నారు. కావున సీపీఐ శ్రేణులు, పార్టీ వివిధ విభాగాల, అనుబంధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సయ్యద్ యాసీన్ పిలుపు నిచ్చారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



పీసీపల్లి: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారు. మండల పరిధిలోని వెంగలాయపల్లి పాఠశాల విద్యార్థులు ఆదివారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో యోగాసనా, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన జస్వంత్, మానస, శివ పార్వతి, స్వర్ణ రేవంత్ సాయి, స్వర్ణ వెంకటసాయి, యశస్విని, వివిధ ఆసనాల్లో జిల్లాస్థాయిలో ప్రథమంగా నిలిచి రాష్ట్రస్థాయికి యోగాసనాలకు ఎంపికైనట్లు యోగా గురువు స్వర్ణ రమణయ్య తెలిపారు. వెంగలాయపల్లి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య కూడా రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, ఉపాధ్యాయుడిని జేసీ గోపాలకృష్ణ అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవోలు శ్రీనివాసచారి, సంజీవులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

వలేటివారిపాలెం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అధికారి శివసిద్ధు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శాఖవరం గ్రామంలో ఇంటింటికి వైద్యం నిర్వహించారు. ముందుగా గర్భిణులకు రక్త పరీక్షల, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఇంటింటికి వెళ్లి వృద్ధులకు దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సమస్యల ఖిల్లా.. కొండపి అడ్డా !

- కొండపి పంచాయతీలో సమస్యల వెల్లువ
- కనిపించని పారిశుద్ధ్యం, వెలగని వీధి దీపాలు
- కుక్కలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



సాయిబాబా గుడి సమీపంలో కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

కొండపి: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న సామెత నియోజకవర్గ కేంద్రమైన కొండపికి కచ్చితంగా సరిపోతుంది. పంచాయతీలో అనునిత్యం ప్రజలను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. పేరుకే నియోజకవర్గ కేంద్రమైన కొండపి వసతుల్లో అంతంతమాత్రంగానే ఉంటుంది. కొండపి పంచాయతీ ప్రజలు సమస్యలతోనే సహవాసం చేస్తున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొండపికి చేరుకోవడానికి కొండపి చుట్టు పక్కల ఉన్న ప్రధాన రహదారులు చెత్తకుప్పలతో ప్రజలకు స్వాగతం పలుకుతున్నాయి. అనకర్లపూడి నుంచి కొండపికి వచ్చే దారిలో పెట్రోల్ బంకు ఎదురు ఆ ప్రాంతంలోని ప్రజలు అంతా చెత్తను అక్కడే వేస్తున్నారు. కొండపి నుంచి కట్టవారిపాలేనికి వెళ్లే రహదారిలో వాగు ప్రాంతంలో గ్రామ ప్రజలు చెత్తను అక్కడే వేస్తున్నారు. అడపాదడపా వర్షాలు పడడంతో చెత్త వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతుంది. ఆ ప్రాంతం దాటాలంటే ప్రయాణించే ప్రయాణికులు వాహనదారులు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్తలోకి నీరు చేరి కుళ్లి దుర్వాసన రావడంతో వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. కొండపి టౌన్‌లో కూడా నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని చెత్తను తొలగించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపైనే వర్షం నీరు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని ఆర్భాటంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. దానికి భిన్నంగా నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో కనిపిస్తున్నాయి. పంచాయతీ పరిధిలోని కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో అన్ని గుంతలే కనిపిస్తున్నాయి. వర్షాలు పడడంతో నీరు ఆ గుంతల్లోనే నిలిచి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి సాయిబాబా గుడి సమీపంలో వర్షపు నీరు మోకాళ్లోతు ప్రవహించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి జండా చెట్టు సచివాలయం ప్రాంతాల్లో సైడ్ కాలవలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ఉంటుంది. అదేవిధంగా పొదిలి రోడ్డు లోని స్టేట్ బ్యాంక్ సమీపంలో, జండా చెట్టు సమీపంలోని విష్ణాలయం వీధిలో వర్షం పడితే వాహనదారుడు, ప్రజలు, పాదచారులు నడవడానికి కూడా తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

ప్రధాన సమస్యగా డ్రైనేజీ..

కొండపికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో అత్యంత ప్రధానమైన సమస్య డ్రైనేజీ. జెండా చెట్టు సమీప ప్రాంతం వరకు కొంతమేర పూడికలు తీసిన చెరువు ప్రాంతానికి వెళ్లేసరికి పూడిక తీత పనులను ఆపివేశారు. దీంతో సైడ్ కల్వలో నీరు ప్రవహించక ఎక్కడివి అక్కడే ఆగిపోతున్నాయి. కొండపి ప్రధాన రహదారిలో ఒకవైపు మాత్రమే సైడు కాలువలు ఉండడంతో రెండవ వైపు నీరు రహదారిలోనే నిలిచి ఉంటుంది. అన్ని ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలు నిర్మించి ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను తీర్చాలని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

వెంటపడుతున్న కుక్కలు..

పంచాయతీలో కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్లే వారిని వెంటాడుతున్నాయి. దీంతో వాకర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారిలో వీధుల్లో కుక్కలు, గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగక అల్లాడుతుంటే ద్విచక్ర వాహనదారులు పాదచారులు కుక్కలు వెంటపడుతుంటే భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులను వెంటాడుడంతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కుక్కల బారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నం చేసి కొంతమంది ద్విచక్ర వాహనదారులు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాత్రి వేళల్లో పాదచారులు ఒంటరిగా నడవాలన్నా కుక్కలు గుంపులుగా ఉండడంతో భయాందోళనలతో ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. కొండపి ప్రధాన రహదారిలో బస్టాండ్ సెంటర్ నుంచి కామేపల్లి సెంటర్ వరకు వీధి దీపాలు వెలగడం లేదు. పలు గ్రామాల్లో కూడా ప్రధాన రహదారుల్లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలని పంచాయతీ ప్రజలు కోరుకుంటున్నారు.



జండా చెట్టు ప్రాంతంలో రాత్రి వేళ చిమ్మచీకటిగా ప్రధాన రహదారి



రాత్రి వేళలో రోడ్డుకు అడ్డంగా గుంపుగా పడుకున్న కుక్కలు



కొండపి, కట్టవారిపాలెం గ్రామాల మధ్య అలుగు వాగులో ఉన్న చెత్త

మానవత్వం చాటిన దద్దాల



సహాయక చర్యల్లో దద్దాల నారాయణ యాదవ్, పార్టీ శ్రేణులు

వెలిగండ్ల(కనిగిరిరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను తక్షణం ఆస్పత్రిలో చేర్చి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మానవత్వం చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కోటాలపల్లి, మరపగుంట్ల మార్గమధ్యంలో రంగనపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ప్రమాదవ శాత్తు బైక్ పై నుంచి జారి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలైయ్యాయి. వివాహ కార్యక్రమాలకు ఆటుగా వెళ్తున్న దద్దాల ప్రమాదాన్ని గమనించారు. వెంటనే స్పందించి తన అనుచరులతో కలిసి 108 వాహనంలో కనిగిరి హాస్పటల్‌కు తరలించారు. క్షతగాత్రురాలికి సహాయం అందించి ఆస్పత్రికి తరలించడంతో దద్దాలను స్థానికులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం, గోపూజ



గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి అభిషేక కార్యక్రమం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ పంచామృతాలతో స్వామివారి ఉత్సవమూర్తికి అభిషేకంగావించారు. అదేవిధంగా గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణగావించి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామస్వాముల విగ్రహ ప్రతిష్ఠ



దద్దాల, నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదరాజుపాలెం పంచాయతీ పరిధిలోని ఎగువపల్లె గ్రామంలో సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఋత్వికుల వేదమంత్రాల నడుమ వైభవంగా సాగుతోంది. ఈసందర్భంగా అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మహాగణపతి హోమం, రుద్రహోమం, లక్ష్మీ హోమం నిర్వహించారు. అనంతరం సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహ మూర్తులకు జలాదివాసం, ధాన్యాదివాసం, వస్త్రాదివాసం, పుష్పాదివాసం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన కలశ పూజ, హోమాల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, పార్టీ నాయకులు కదిరి పార్థసారథి పలువురు పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ బి.వెంకటయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ పందిళ్ల నాగమణి, టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, జె.నరేష్, రామిశెట్టి బాబు, దనెంకుల నాగార్జున, నాగం వెంకటస్వామి, చింతనబోయిన కొండయ్య, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, బసివి చంద్రశేఖర్, బొర్రాజు రమణయ్య, సిద్దు వెంకటరెడ్డి, పులి మాల్యాద్రిరెడ్డి, మన్నేపల్లి పెద్దన్న మన్నేపల్లి రవి, ఆవుల భాస్కర్‌రెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, పల్నాటి భాస్కర్, సైకం ఏడుకొండలు, గోడి నారాయణరెడ్డి, పులి రామచంద్రారెడ్డి, డి.వెంకటరాజు, యంబడి ప్రవీణ్, డి.వెంకటస్వామి, మీసాల వెంకటస్వామి, కే.వెంకటేశ్వర్లు, పందిళ్ల పాపారావు, తెల్లదాల కొండయ్య, మేకల నాగార్జున, డి.శ్రీనివాసులు, పోకల వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

ఎవరికి వారే యమునా తీరే..



గ్రామ పార్టీ అధ్యక్షుడు లేకుండా వెలసిన ఫ్లెక్సీ

టాస్క్‌ఫోర్స్: ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో ఉంది కొండపి మండలంలోని పెరిదేపి గ్రామంలో టీడీపీ పరిస్థితి. నియోజకవర్గ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం సింగరాయకొండలో ఏర్పాటు చేశారు. పెరిదేపి గ్రామానికి చెందిన మార్పూరి వెంకటేశ్వర్లుకు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఈ సందర్భంగా పెరిదేపి గ్రామంలో శుభాకాంక్షలు తెలుపుతూ టీడీపీ నాయకులు కార్యకర్తలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఫోటోలు లేకుండా వెలిశాయి. దీంతో గ్రామంలో పార్టీ రెండుగా విడిపోయిందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మండలంలోని టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయిందని, పెరిదేపి గ్రామంలో కూడా అదే కొనసాగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల సైతం టీడీపీ నాయకులతో శుభాకాంక్షలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ ఉద్యోగులా ? టీడీపీ కార్యకర్తలా ? అన్న సందేహం నెలకొనిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

త్వరలో అన్ని వసతులు కల్పిస్తాం

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న ఆర్ఎం సత్యనారాయణ

కొండపి: స్థానిక బస్టాండ్‌లో త్వరలో అన్ని వసతులు కల్పిస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం కొండపి బస్టాండుతో పాటు పరిసరాలను పరిశీలించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీసి వార్తలు రాయడం శుభ పరిణామం అన్నారు. బస్టాండ్‌లో కనీస వసతులు కరువు అన్న శీర్షికతో గత ఆదివారం సాక్షిలో కథనం వెలువడింది. ఆ కథనానికి స్పందించిన అధికారులు బస్టాండ్‌లో కుర్చీలను ఏర్పాటు చేసినట్లు రీజనల్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నుంచి ఫ్యాన్లు అందుబాటులోనికి రానున్నాయని తెలిపారు. త్వరలోనే బస్టాండ్ పరిసరాలలో మంచినీటి సాకర్యాలను ప్రయాణికులకు కల్పిస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే నా దష్టికి తీసుకొని వస్తే వెంటనే సమస్యలను పరిష్కరించి వసతులను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కొండపి నుంచి కనిగిరికి నేరుగా బస్సును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు అడగగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని ప్రయాణికులకు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ రావు, ఏడుకొండలు, మహిళా ప్రయాణికులు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో వెళ్తున్న లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

టంగుటూరు: ముందు టైరు పగలడంతో మొక్కలతో వెళ్తున్న లారీ బోల్తా కొట్టింది. ఈఘటన మండలంలోని తూర్పునాయుడుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాజమండ్రి నుంచి కోలార్‌కు మొక్కల లోడుతో లారీ వెళ్తోంది. ఈక్రమంలో సూరారెడ్డిపాలెం దాటిన తర్వాత లారీ ముందు టైరు పగిలి డివైడరు ఎక్కి ఒంగోలు వైపు వెళ్లే రోడ్డులో బోల్తా పడింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్‌కు, ఇతరులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనా స్థలాన్ని జాతీయ రహదారి పోలీసులు చేరుకొని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

పింఛన్ల తొలగింపు సరైంది కాదు

కనిగిరిరూరల్:



పింఛన్లు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కూటమి ప్రభుత్వం వెరిఫికేషన్ పేరితో అర్హత గల అబ్ధిదారుల పింఛన్లను తొలగించడం సరైంది కాదని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 11వ వార్డులోని కాశిరెడ్డి కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వార్డులో అనేక మంది అర్హుల పింఛన్లను తొలగించారన్నారు. వైకల్యం తక్కువ శాతం ఉందనే నెపంతో పింఛన్‌ను తొలగించడం సరైంది కాదన్నారు. పింఛన్ నిలుపుదల చేసిన పింఛన్ దారులకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోనే తిరిగి వైకల్యం శాతం పరిక్షలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్ దారులు, కొత్త పింఛన్ దరఖాస్తు దారులు వైకల్యం పరిక్షలకు ఇతర ప్రాంతాల్లోని ఏరియా వైద్య శాలలకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. కనిగిరిలో దివ్యాంగుల శాతంను నిర్ధారించే విధంగా సదరన్ క్యాంప్ పెట్టాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనంతరం 13వ వార్డులో ఆయన పర్యటించారు. గత నాలుగు రోజుల నుంచి కుళాయి నీళ్లు రావడం లేదని తెలిపారు. బోర్లు మరమ్మతులు కావడంతో నీటి సరఫరా నిలించిందని, రెండు రోజుల్లో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్, కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యం నీరుగారుతోంది..!



పీసీపల్లి: మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి అని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పుడప్పుడూ మనకు ప్రసంగాలు చేస్తుంటారు కదా. కాని వారు మాత్రం అక్షరాల పాటించరు. లక్షలు వెచ్చించి ప్రభుత్వం ఖర్చు పెట్టి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండలానికి కేటాయించిన మొక్కలు ఓ మూలన గోడ చాటున పడిఉన్నాయి. అన్ని పాఠశాలకు పంపిణీ చేయాల్సిన మొక్కలు అలా పడేసి ఉండటం బాధాకరం. స్త్రీశక్తి భవనం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం ఎదురు పడేసి అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. వీటిని ఎవరు పట్టించుకోకపోవడంతో మొక్కలు వృథాగా పడి ఎండిపోతున్నాయి.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకుడు కళ్యాణ్‌కుమార్

సింగరాయకొండ:

జనసేన పార్టీ మండల నాయకులు గోరంట్ల కళ్యాణ్‌కుమార్ వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పార్టీ కండువా కప్పి కళ్యాణ్‌కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో జనసేన పార్టీ గెలుపు కోసం కష్టపడ్డానని.. కాని పార్టీలో కష్టపడ్డవారికి గుర్తింపు లేదని దీంతో తాను వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, షేక్ సుల్తాన్, చుక్కా కిరణ్‌కుమార్, గాదంశెట్టి గుప్తా, పాలూరి శ్రీనివాసులరెడ్డి, కోమట్ల వెంకారెడ్డి, సోమిశెట్టి సురేష్, షేక్ నౌషాద్, మాలె రంగారెడ్డి, చొప్పర కిరణ్, పసుపులేటి శ్రీనివాసరావు, షేక్ కరీం, నరేష్, తదితరులు పాల్గొన్నారు.